# కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

## : భవన నిర్మాణ కార్మికులు

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 1 : అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు నేతలు కోరారు. రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీ నగర్ ఆస్బెస్టాస్ కమాన్ వద్ద ఇవాళ భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. కార్మికుల అడ్డాల్లో కనీస వసతులు, 65 ఏళ్ల వారికి రూ. 10 వేల పెన్షన్ అందించాలన్నారు.సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వివరిస్తామన్నారు. చెట్టినాడ్ సిమెంట్ ప్రతినిధులు పని చేసే చోట కార్మికులు తీసుకోవలసిన జాగ్రత్తలు, సేఫ్టీ పరికరాల గురించి వివరించారు. ఈ సమావేశంలో ఐలయ్య, రషీద్, మదన్, సాయి, యూసఫ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :34 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 02-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు తగ్గాయి



2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని మోదీ ప్రభుత్వం పూర్తిగా నిర్మూలిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు తగ్గినట్లు వెల్లడించారు. నక్సల్ రహిత భారత్‌ను నిర్మించే దిశగా మనం మరో మైలు రాయిని చేరుకున్నామన్నారు.ఛత్తీస్‌గఢ్ అడవుల్లో గత కొన్ని రోజులుగా వరుస ఎన్‌కౌంటర్‌లు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ కాల్పుల్లో అనేక మంది మావోలు హతమవుతున్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతపై అమిత్ షా తాజాగా స్పందించారు. దేశంలో నక్సలిజాన్ని అంతం చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం కఠినమైన విధానాన్ని అవలంభిస్తున్నట్లు చెప్పారు. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారని.. ఇందులో భాగంగా సురక్షిత భారత్‌ను నిర్మించడానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు.'నేడు భారత్‌లో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 నుంచి ఆరుకు తగ్గాయి. తద్వారా కొత్త మైలురాయిని సాధించాం. మోదీ ప్రభుత్వం నక్సలిజం పట్ల కఠినమైన విధానాన్ని అవలంభిస్తోంది. మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా సురక్షిత భారత్‌ను నిర్మించడానికి కృషి చేస్తున్నాము. 2026 మార్చినాటికి నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తాం' అని అమిత్ షా వ్యాఖ్యానించా రు.హోంమంత్రిత్వ శాఖ రూపొందించిన నివేదికల ప్రకారం.. దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 ఉన్నాయి. అధికారిక రికార్డుల ప్రకారం..2015లో ఇవి 35 ఉండగా.. 2018 నాటికి 30కి తగ్గాయి. 2021నాటికి 25కు వచ్చాయి. తాజాగా వాటి సంఖ్య 6కు చేరింది. మరోవైపు రాష్ట్రంలో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను సమీక్షించేందుకు అమిత్ షా ఈనెల 4, 5 తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కార్యకలాపాలను సమీక్షించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అనంతరం షా ఏప్రిల్ 7, 8 తేదీల్లో జమ్ముకశ్మీర్‌లో కూడా పర్యటించే అవకాశం ఉన్నట్లు సదరు వర్గాలను ఊటంకిస్తూ పీటీఐ నివేదించింది.

## తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులందరికీ సన్నబియ్యం : మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 1 : రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ నేటి నుంచి సన్న బియ్యం పథకాన్ని అందిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని బుడగ జంగం కాలనీలో ఇవాళ సన్న బియ్యం పథకం మంత్రి పొన్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులందరికీ సన్నబియ్యం అందిస్తామన్నారు. ఈ పథకం దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణలో ప్రారంభించడం జరిగిందని.. ఇది దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆయన చెప్పారు.రాష్ట్రంలోని 17,263 చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యాన్ని అందిస్తున్నట్లు ఆయన వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని సన్న బియ్యం పథకాన్ని అందిస్తున్నామని.. దీని ద్వారా రాష్ట్రంలో రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అడ్డుకట్ట వేయడం జరుగుతుందని చెప్పారు.గతంలో దొడ్డు బియ్యం రేషన్ షాపుల నుంచి ఇంటిదాకా కూడా చేరలేదని.. పక్కదారి పట్టాయని ఇకనుంచి అలాంటి పరిస్థితులు ఎక్కడా కనిపించవన్నారు. ప్రతి ఒక్కరు సన్న బియ్యాన్ని వినియోగించుకుంటారని మంత్రి పొన్నం ఆశాభావం వ్యక్తం చేశారు.

### గ్యాస్ డబ్బులు రావట్లేదు..


చింతల లలిత అనే మహిళ తనకు గ్యాస్ డబ్బులు రావడం లేదని సన్న బియ్యం పథకం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కేంద్ర ప్రభుత్వం విధానం వల్ల కొన్ని ఇబ్బందులు జరిగాయని, గ్యాస్ డబ్బులు తప్పనిసరిగా వచ్చేందుకు కృషి చేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. చిన్నచిన్న ఇబ్బందులు ఏమున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీఓ రామమూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య తదితరులు ఉన్నారు.

## హెచ్‌సీయూ వద్ద విద్యార్థుల ఆందోళన.. పరిస్థితి ఉద్రిక్తం



కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కంచ గచ్చిబౌలి భూములను పరిరక్షించాలంటూ పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్దకు చేరుకుని నిరసన తెలుపుతున్నారు. యూనివర్సిటీ లోపలికి వెళ్లేందుకు బీజేవైఎం, ఏబీవీపీ, వామపక్షాల నేతలు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. దాంతో రేవంత్ సర్కారుపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అంతరాత్మకే షాక్.. యూపీ కూల్చివేతలపై సుప్రీం



న్యూఢిల్లీ: బుల్డోజర్లతో ఇండ్లను కూల్చివేసిన ఉత్తరప్రదేశ్ సర్కార్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అమానవీయంగా, అక్రమంగా ఆ చర్యలు చేపట్టినట్లు కోర్టు పేర్కొన్నది. యూపీ సర్కారు, ప్రయాగ్‌రాజ్ డెవలప్మెంట్ అథారిటీ చర్యలను కోర్టు తీవ్రంగా ఖండించింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఉజ్వల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం.. ఇండ్ల కూల్చివేత కార్యక్రమాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. దేశంలో ఓ చట్టం ఉందని, పౌరుల నివాసాలను ఆ రీతిలో కూల్చడం సరైంది కాదు అని కోర్టు పేర్కొన్నది. యూపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు తమ అంతరాత్మను షాక్‌కు గురిచేసినట్లు సుప్రీంకోర్టు తెలిపింది. నివాస హక్కు అనేది ఒకటి ఉందని, దీని కోసం కనీస చట్టాలను పాటించాలని సుప్రీం ధర్మాసనం చెప్పింది. ఇండ్లు కోల్పోయిన వారికి తక్షణమే ఆరు వారాల్లోగా పది లక్షల నష్టపరిహారాన్ని ఇవ్వాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది.గతంలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన బుల్డోజర్ చర్యలను ఖండిస్తూ యూపీ సర్కార్‌ను అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా విమర్శించింది. ఎటువంటి లీగల్ చర్యలు చేపట్టకుండా ఇండ్లను కూల్చడం సమంజసం కాదని పేర్కొన్నది. ఇది షాకింగ్, తప్పుడు సంకేతాలు పంపినట్లు కోర్టు తెలిపింది. గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్‌తో లింకు వారికి చెందిన ఇండ్లు అని తప్పుడు భావనతో కూల్చివేతలకు పాల్పడినట్లు పిటీషనర్ తరపున న్యాయవాది ఆరోపించారు. 2023లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్‌ను హతమార్చిన విషయం తెలిసిందే.అడ్వకేట్ జుల్ఫికర్ హైదర్, ప్రొఫెసర్ అలీ అహ్మద్‌తో పాటు ఇతరులు వేసిన పిటీషన్‌పై ఇవాళ సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఇండ్ల కూల్చివేతలను ప్రశ్నిస్తూ దాఖలైన పిటీషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది.

## కేటీఆర్, హరీష్‌రావు ఇళ్లవద్ద పోలీసుల మోహరింపు



హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూములపై వివాదం నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలనివాసాల వద్ద పోలీసులు మోహరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావునివాసాల వద్దకు పోలీసులు చేరుకున్నారు. ఇదిలావుంటే హెచ్‌సీయూ వద్ద ఆందోళనకు దిగిన బీజేవైఎం,సీపీఐ, సీపీఎం నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. చికోటి ప్రవీణ్ సహా పలువురు నేతలను అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. పరిస్థితి అదుపుతప్పకుండా హెచ్‌సీయూ వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

### హైకోర్టులో పిల్..

కాగా కంచ గచ్చిబౌలి భూములపై హైకోర్టులో పిల్ దాఖలైంది. కంచ గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలంటూ వట ఫౌండేషన్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. అత్యవసర విచారణకు స్వీకరించాలని ఫౌండేషన్ తరఫు న్యాయవాది కోరారు. దీనిపై బుధవారం విచారణ చేపడతామని హైకోర్టు తెలిపింది.

## 1300 పాయింట్లు పతనమైన సెన్సెక్స్..



కొత్త ఆర్థిక సంవత్సరం తొలి రోజునే దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా సుంకాల ఆందోళనలతో సెంటిమెంట్ దిబ్బతిన్నది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున మార్కెట్లు పతనమవుతున్నాయి. ఈద్ సందర్భంగా సోమవారం మార్కెట్లు పని చేయని విషయం తెలిసిందే. మంగళవారం మార్కెట్లు నష్టాలతోనే మొదలయ్యాయి. ప్రారంభంలోనే సెన్సెక్స్ 639.13 పాయింట్లు తగ్గి.. 76,775.79 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సైతం 180.25 పాయింట్లు తగ్గి 23,339.10 పాయింట్లకు చేరింది. ప్రస్తుతం సెన్సెక్స్ 1265.12 పాయింట్లు తగ్గి.. 76149.80 పాయింట్ల వద్ద ట్రేడవుతున్నది. ఇక నిఫ్టీ 322.65 పాయింట్లు తగ్గి.. 23,196.70 పాయింట్ల వద్ద కొనసాగుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతికార టారిఫ్‌లపై బుధవారం తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

%అదే సమయంలో ఇన్ఫోసిస్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ షేర్ల అమ్మకాలతో మార్కెట్‌పై మరింత ఒత్తిడి పెరిగింది. ఇక చమురు ధర పెరగడం కూడా ఓ కారణం. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.51 శాతం పెరిగి 74.74 డాలర్లకు చేరుకుంది. భారత్ చమురు దిగుమతులపై ఆధారపతుండడగా.. చమురు ధరల పెరుగుదల మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దానికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. శుక్రవారం రూ.4352.82 కోట్ల విలువ షేర్లను విక్రయించారు. ఇక ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాలో ఆర్థిక మాంద్యం ప్రభావం పడే అవకాశం ఉందని గోల్ట్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ఈ క్రమంలో పెట్టుబడిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రస్తుతం మార్కెట్‌లో బజాజ్ ఫైనాన్స్ సర్వీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, హిందాల్కో, హెచ్‌సీఎల్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ కంపెనీ, శ్రీరామ్ ఫైనాన్స్, టీసీఎస్ నష్టాల్లో కొనసాగుతుండగా.. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సిప్లా, డాక్టర్ రెడ్డీస్, బజాజ్ ఆటో, ఓఎన్‌జీసీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభాల్లో కొనసాగుతున్నాయి.

## బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ యూనుస్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన అస్సాం సీఎం



గౌహతి: బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ మొహమ్మద్ యూనుస్ ఇటీవల చైనాలో పర్యటించారు. ఆ సమయంలో ఆయన భారత్‌కు చెందిన ఏడు ఈశాన్య రాష్ట్రాలపై కామెంట్ చేశారు. తమ ప్రాంతంలో సముద్ర సంరక్షకులం తామే అని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ పేర్కొన్నారు. దానికి సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అవుతున్నది. ఈ నేపథ్యంలో అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మస్పందించారు. బంగ్లా చీఫ్ అడ్వైజర్ యూనుస్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు దురుద్దేశ పూర్వకంగా ఉన్నట్లు తెలిపారు. %ఇటీవల నాలుగు రోజుల పాటు యూనుస్ చైనాలో పర్యటించారు. భారత్‌కు చెందిన ఈశాన్య రాష్ట్రాలపై అక్కడ యూనుస్ వ్యాఖ్యలు చేశారు. ఆ రాష్ట్రాల భూభాగం ల్యాండ్‌లాక్ అయ్యిందని, ఆర్థిక అవసరాల నిమిత్తం తమకు సాయం చేయాలని చైనాను యూనుస్ కోరారు. ఈశాన్య రాష్ట్రాలకు పట్టులేకపోవడం వల్ల.. ఆ ప్రాంతంలో సముద్ర సంరక్షణ బంగ్లాదేశ్ చూసుకుంటుందని యూనుస్ పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు బిశ్వ శర్మ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు. యూనుస్ చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలను తేలికగా తీసుకోవద్దు అని సీఎం తెలిపారు. బంగ్లా చీఫ్ వ్యాఖ్యలు వ్యూహాత్మక, సుదీర్ఘ ప్రయోజనాలతో ఉన్నట్లు పేర్కొన్నారు.

## మా పాఠశాలల్లో విద్యార్థులకు తమిళం, తెలుగు భాషలను బోధిస్తున్నాం : యూపీ సీఎం



జాతీయ విద్యావిధానం లో భాగమైన త్రిభాషా సూత్రం అమలు విషయంలో కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య గతకొన్ని రోజులుగా వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. కేంద్రం ప్రతిపాదించిన త్రిభాషా సూత్రాన్ని స్టాలిన్ ప్రభుత్వం ముందు నుంచీ వ్యతిరేకిస్తూ వస్తోంది. దక్షిణాది రాష్ట్రాలపై హిందీని బలవంతంగా రుద్దడం ఏంటని ప్రశ్నిస్తోంది. ఈ వ్యవహారంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తాజాగా స్పందించారు. యూపీలోని పాఠశాలల్లో విద్యార్థులకు తమిళం, తెలుగుతోపాటు పలు రాష్ట్రాల అధికారిక భాషలను బోధిస్తున్నట్లు చెప్పారు. %ఈ మేరకు తమిళనాడులోని స్టాలిన్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసమే త్రిభాషా విధానంపై వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. 'ఉత్తరప్రదేశ్‌లోని పాఠశాలల్లో విద్యార్థులకు తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, బెంగాలీ, మరాఠీ వంటి భాషలను బోధిస్తున్నాం. దీని కారణంగా మా రాష్ట్రం ఏమైనా చిన్నదైపోతుందా..? దీనివల్ల రాష్ట్రంలో కొత్త ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలను సృష్టించగలుగుతున్నాం. కొందరు స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం త్రిభాషా విధానంపై వివాదాలు సృష్టిస్తున్నారు. ఇది యువత ఉపాధి అవకాశాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది' అని యోగి అన్నారు. సీఎం యోగి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత కార్తీ చిదంబరం స్పందించారు. ఈ మేరకు 'స్టాప్ హిందీ ఇంపోజిషన్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'యూపీ ప్రభుత్వం తమ పాఠశాలల్లో తమిళంలో పాఠాలు చెప్పేందుకు ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నారనే వివరాలను ఇస్తుందా..? తమిళ భాషను నేర్చుకునేందుకు ఎంత మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు..?' అని ఆయన ప్రశ్నించారు. తమిళనాడులోని విద్యార్థులు హిందీని తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా కార్తీ పేర్కొన్నారు.

## బాణసంచా కర్మాగారంలో పేలుడు.. ముగ్గురు మృతి



గుజరాత్ )లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బనస్కాంత జిల్లాలోని ఓ బాణసంచా కర్మాగారం లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు.

%దీసా పట్టణానికి సమీపంలో ఉన్న బాణసంచా కర్మాగారంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ పేలుడు కారణంగా కర్మాగారంలోని కొంత భాగం కూలిపోయినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ చౌదరి తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా.. ఆరుగురు గాయపడ్డారు. రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది శిథిలాల కింద చిక్కుకుపోయిన కార్మికులను రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు జిల్లా పరిపాలన అధికారి ఒకరు తెలిపారు.

## సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టిపై కేసు నమోదుకు ఫిర్యాదు



ఇల్లెందు, ఏప్రిల్ 1 : హామీల అమలులో విఫలమైనందున రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కపై కేసులు నమోదు చేయాల్సిందిగా కోరుతూ ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఇల్లందు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సందీప్‌కి బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆరు గ్యారంటీల అమలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా హరిప్రియ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ అలివి కానీ హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసినందుకుగాను వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. %రైతులకు రుణ మాఫీ పూర్తి స్థాయిలో చేయకుండా చేసినట్లు చెబుతున్నందుకుగాను, రైతు భరోసా రైతులకు పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా నిరసించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్, సిలివేరి సత్యనారాయణ, జేకె శ్రీను, తోట లలిత శారద, సుజాత, పరుచూరి వెంకటేశ్వర్లు, కంభంపాటి రేణుక, దేవీలాల్, బావుసింగ్, నబి, చాందు, గిన్నారపు రాజేశ్, కాసాని హరిప్రసాద్, లక్ష్మీనారాయణ, ధనలక్ష్మి, సరిత పాల్గొన్నారు.

# అత్యాచారం కేసు.. పాస్టర్ బాజిందర్ సింగ్‌కు జీవితఖైదు

అత్యాచారం కేసులో సెల్ఫ్ స్టైల్డ్ క్రిస్టియన్ పాస్టర్ బాజిందర్ సింగ్ కు పంజాబ్ కోర్టు శిక్ష ఖరారు చేసింది. ఆయనకు జీవిత ఖైదువిధిస్తూ ఇవాళ సంచలన తీర్పు వెలువరించింది. 'యేసు యేసు ప్రాఫెట్ గా సింగ్ పాపులర్ అయ్యాడు. బాజిందర్ సింగ్ తనపై అత్యాచారానికి పాల్పడినట్లు 2018లో పంజాబ్‌లోని జిరాక్‌పూర్ కు చెందిన ఓ మహిళ ఆరోపించింది. విదేశాలకు తీసుకెళ్తానని మాయమాటలు చెప్పి బాజిందర్ తనను శారీరకంగా వాడుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది.దాంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఆయనతోపాటు మొత్తం ఏడుగురిపై ఈ కేసులో అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసు విచారణ జరిపిన ట్రయల్ కోర్టు బాజిందర్ సింగ్‌ను నాలుగు రోజుల క్రితం దోషిగా తేల్చింది. కేసులో అభియోగాలు మోస్తున్న మిగతా ఆరుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇవాళ అతడికి శిక్ష ఖరారు చేసింది. బాజీందర్ సింగ్‌కు జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది.కాగా బాజిందర్ సింగ్ తరచూ వివాదాల్లో ఉంటుంటాడు. ఇటీవల ఆయన తన కార్యాలయంలో ఓ మహిళపైన, మరో వ్యక్తిపైన దాడికి పాల్పడిన దృశ్యాలు



సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వారిని చెంపలపై కొట్టడం, చేతికి ఏది దొరికితే అది విసరడం లాంటి దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. 2022లో ఓ 22 మహిళ సింగ్ తనను లైంగికంగా వేధించాడని ఆరోపించింది. 2022లోనే అనారోగ్యంతో ఉన్న ఓ మహిళను బాగుచేస్తానని చెప్పి ఆమె కుటుంబం నుంచి భారీగా డబ్బులు వసూలు చేశాడు. కానీ ఆమె మరణించింది.

# జర్మనీ యువతిపై క్యాబ్ డ్రైవర్ల లైంగిక దాడి..

పహాడి షరీఫ్, ఏప్రిల్ 1: హైదరాబాద్ నగరంలో దారుణ ఘటన చోటు చేసుకున్నది. స్వదేశానికి వెళ్లేందుకు బయలుదేరిన జర్మనీ యువతికి లిఫ్ట్ ఇస్తామంటూ క్యాబ్ డ్రైవర్లు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జర్మనీకి చెందిన ఓ యువతి శుభ కార్యానికి హాజరయ్యేందుకు మార్చి 4న నగరానికి వచ్చింది. అప్పటి నుంచి నగరంలోనే ఉన్న యువతి.. మార్చి 31న జర్మనీ వెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకుంది. అదే రోజు రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వెళ్లేందుకు మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండమల్లమ్మ క్రాస్ రోడ్‌లో క్యాబ్ కోసం ఎదురు చూస్తుంది.అదే సమయంలో అక్కడకు చేరుకున్న ఓ క్యాబ్ డ్రైవర్ ఎయిర్ పోర్ట్ వరకు లిఫ్ట్ ఇస్తానని చెప్పి కారులో యువతిని ఎక్కించుకున్నాడు. అప్పటికే కారులో మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ఎయిర్ పోర్ట్‌కి వెళ్లేదారిలో మధ్యలో కారు నిలిపి వేసి యువతిపై



ముగ్గురు లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం యువతికి అక్కడే వదిలేసి దుండగులు పారిపోయారు. బాధితురాలు స్థానికుల సహాయంతో పహాడిషరీఫ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సీసీ కెమెరాల్లో నమోదైన విజువల్స్ ద్వారా క్యాబ్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# సల్మాన్ ఖాన్ ఈద్ పార్టీ.. ఏయే సెలబ్రిటీలు హాజరయ్యారంటే..!

బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ ప్రతి ఏడాది ఈద్‌ని ఎంతో ఘనంగా జరుపుకుంటాడన్న విషయం తెలిసిందే. అంతేకాకుండా ఈద్‌కి తన సినిమా రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేసుకుంటాడు. తాజాగా సికందర్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా, ఈ మూవీ అంతగా అలరించలేకపోయింది. అయితే సల్మాన్ ఖాన్ తన ఇంట ఈద్ పార్టీ నిర్వహించగా, ఈ కార్యక్రమంలో సంప్రదాయ దుస్తులు కాకుండా కార్టూన్ థీమ్ పాంట్ ఒకటి ధరించి భారీ భద్రత మధ్య కనిపించాడు. ఇక పార్టీకి సోనాలి బెంద్రే పింక్ మరియు బ్లూ టోన్డ్ సల్వార్ సూట్ ధరించి హాజరైంది.ఇక సోనాక్షి సిన్హా తన భర్త జహీర్ ఇక్బాల్‌తో కలిసి సల్మాన్ ఖాన్ ఈద్ బాష్‌కు హాజరైంది. ఈ జంట కలిసి ప్రత్యేకంగా ఫొటోలకి పోజులిచ్చారు. ఇక బబ్లీ గార్ల్ జెనీలియా డిసౌజా రితేష్ దేశ్‌ముఖ్‌తో కలిసి పార్టీకి హాజరైంది. జెనీలియా లేత బంగారు రంగు అద్దాలతో ఉన్న సల్వార్ సూట్‌లో మెరిసింది.ఆమె భర్త రితేష్ బ్లాక్ కుర్తా ధరించి క్యూట్‌గా కనిపించారు. షమితా శెట్టి లేత బంగారు రంగు డ్రెస్ ధరించి, వాటికి చోకర్‌తో జత చేసి, పాపరాజీలకు ఫోజులిస్తూ క్యూట్‌గా కనిపించింది. ఇక మలైకా అరోరాతో అర్బాజ్ ఖాన్ కుమారుడు అర్హాన్ ఖాన్



బ్లాక్ కుర్తా ధరించి అంకుల్ సల్మాన్ ఖాన్ ఈద్ పార్టీకి స్టైల్‌గా హాజరయ్యాడు.సల్మాన్ ఖాన్ సోదరి అర్పితా ఖాన్ ఎరుపు రంగు సల్వార్ సూట్ ధరించి సల్మాన్ ఖాన్ ఈద్ పార్టీకి హాజరై ఫొటోలకి ఫోజులిచ్చింది. మొత్తానికి సల్మాన్ ఇంట జరిగిన ఈద్ బాష్‌కి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. ఇక ఇదిలా ఉంటే సల్మాన్ ఖాన్ నటించిన సికందర్ చిత్రాన్ని మురుగదాస్ తెరకెక్కించగా, ఈ చిత్రం మార్చి 30న విడుదలైంది. తొలి రోజు ఈ చిత్రం ఇండియా వ్యాప్తంగా 30 కోట్ల రూపాయల వసూళ్లు రాబట్టగా, గ్లోబల్‌గా 50 కోట్లు రాబట్టినట్టు తెలుస్తుంది.

# దమ్ముంటే నా సినిమాను బ్యాన్ చేయండి : నిర్మాత నాగవంశీ



టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ నిర్మాణంలో వచ్చిన తాజా చిత్రం మ్యాడ్ స్క్వేర్, సూపర్ హిట్ చిత్రం మ్యాడ్ సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ మూవీ టికెట్ రేట్లు ఎక్కువగా ఉన్నాయని.. సినిమా బాగాలేకున్న మేకర్స్ ఫేక్ కలెక్షన్ల్ చూపిస్తున్నారని కామెంట్లు వస్తున్న విషయం తెలిసిందే. పలు వెబ్‌సైట్‌లలో ఈ సినిమాకు నెగిటివ్ రివ్యూలు వచ్చాయి. దీంతో తాజాగా ప్రెస్ మీట్ పెట్టిన నాగవంశీ.. మీడియా జర్నలిస్ట్‌లతో పాటు రివ్యూలు ఇచ్చే పలు వెబ్‌సైట్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు.

%ఆ సినిమాకు తక్కువ కలెక్షన్లు వచ్చాయని అంటున్నారు. వారికి నేను సమాధానం చెప్పాలి అనుకుంటున్నా. ఎవరికి తక్కువ కలెక్షన్లు వచ్చాయి అనిపిస్తుందో నా దగ్గరికి రండి వారికి అసలు కలెక్షన్లు చూపిస్తాను. ఇదేమైన పెద్ద హీరో సినిమానా కలెక్షన్లు రాకున్న బయట హౌస్‌ఫుల్ బోర్డ్ పెట్టడానికి.. నాకు అలాంటి అవసరం కూడా లేదు. సినిమా ఆడుతున్నప్పుడు.. ఎందుకు సపోర్ట్ చేయడం లేదు. ఎందుకు నెగిటివ్ రివ్యూలు రాస్తున్నారు. నా మీద అంత పగ ఉంటే దమ్ముంటే నా సినిమాలు బ్యాన్ చేసి చూపించండి. నా సినిమా ఆర్టికల్స్ రాయకండి. నా దగ్గర యాడ్ తీసుకోకండి. అప్పుడు నేను కూడా చూపిస్తాను నా సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో అంటూ నాగవంశీ చెప్పుకోచ్చాడు.

# కుటుంబ ఆదాయ వివరాలను వెల్లడించిన జెలెన్‌స్కీ

ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తన కుటుంబ ఆదాయ వివరాలను వెల్లడించారు. గతేడాది అంటే 2024లో తాను తీసుకున్న వేతనం, తన కుటుంబ ఆస్తులు, ఆదాయం వంటి వివరాలను వెల్లడించారు. ఈ వివరాల ప్రకారం.. అంతకుముందు ఏడాది (2023)తో పోలిస్తే అధ్యక్షుడి ఆదాయంలో పెరుగుదల కనిపించింది. కాగా, ఉక్రెయిన్‌లో ప్రభుత్వాధికారులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించడం తప్పనిసరి. ప్రభుత్వ పెద్దలు గానీ, అధికారులు గానీ తమ ఆస్తుల వివరాలను ఏటా బహిరంగంగా వెల్లడించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా 2024 సంవత్సరంలో తన ఆస్తుల వివరాలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. 2024లో తన కుటుంబ ఆదాయం 15,286,183 ఉక్రేనియన్ హ్రైవ్నియాలుగా ప్రకటించారు. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 3.15 కోట్లు అన్న మాట. ఇందులో ప్రభుత్వ సేల్స్ బాండ్స్ నుంచి వచ్చిన ఆదాయం 8,585,532 (రూ.1.77 కోట్లు) హ్రైవ్నియాలుగా ఉంది. మిగిలిన మొత్తం అధ్యక్షుడి వేతనం, బ్యాంకు వడ్డీ, ప్రైవేటు రియల్ ఎస్టేట్ అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చిన చెల్లింపులుగా 'ది కీవ్ ఇండిపెండెంట్' తెలిపింది.అంతకుముందు ఏడాది (2023) ఇదే సమయంలో తన కుటుంబ



సభ్యుల ఆదాయం 316,700 డాలర్లుగా (రూ. 2.7 కోట్లు) జెలెన్‌స్కీ ప్రకటించారు. ఆ వివరాల ప్రకారం.. 2023తో పోలిస్తే గతేడాది అధ్యక్షుడి కుటుంబ ఆదాయంలో పెరుగుదల కనిపించింది. అయితే, ఈ పెరుగుదల అద్దెల ద్వారా వచ్చిందేనని కీవ్ పత్రిక తెలిపింది. అధ్యక్షుడి కుటుంబ ఆస్తులు, రియల్ ఎస్టేట్, వాహనాలలో ఎలాంటి మార్పులు లేవని తెలిపింది.

# ప్రతీకారానికి ఇదే సరైన సమయం : వైట్‌హౌస్

భారత్ సహా పలు దేశాలపై ప్రతీకార సుంకాలను విధించేందుకు అగ్రరాజ్యం అమెరికా సిద్ధమైన విషయం తెలిసిందే. టారిఫ్‌ల విషయంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయం ప్రకటించనున్నారు. ట్రంప్ విధించబోయే ప్రతీకార సుంకాల డెడ్‌లైన్ దగ్గరపడుతుండటంతో ఈ అంశంపై ఉత్కంఠ నెలకొంది. అయితే, సుంకాల విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ అంశంపై వైట్‌హౌస్ తాజాగా స్పందించింది. ఈ మేరకు వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ.. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు తెలిపారు. భారత్ మాత్రమే కాకుండా ఇతర దేశాలు కూడా తమ ఉత్పత్తులపై అధిక సుంకాలను విధిస్తూ.. అన్యాయమైన వాణిజ్య పద్ధతులను అనుసరిస్తున్నాయని వ్యాఖ్యానించారు. దీని వల్ల తమ ఉత్పత్తులను ఎగుమతి చేయడం కష్టతరమవుతోందని అన్నారు. ఇప్పుడు ప్రతీకారం తీర్చుకునే సమయం వచ్చిందని.. అధ్యక్షుడు చారిత్రాత్మక మార్పులు చేయబోతున్నారని వ్యాఖ్యానించారు.'పలు దేశాలు అన్యాయమైన వాణిజ్య పద్ధతులను అనుసరిస్తున్నాయి. అమెరికా పాల ఉత్పత్తులపై యూరోపియన్



యూనియన్ 50 శాతం సుంకాలు విధిస్తోంది. అమెరికా బియ్యంపై జపాన్ 700 శాతం సుకం వసూలు చేస్తోంది. యూఎస్ బటర్, చీజ్‌పై కెనడా 300 శాతం, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100 శాతం టారిఫ్‌లు విధిస్తున్నాయి. వీటి వల్ల మా ఉత్పత్తులను ఆయా మార్కెట్లకు ఎగుమతి చేయడం కష్టతరంగా మారుతోంది. ఈ కారణంగా అమెరికన్ల వ్యాపారాలు కూడా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అందుకే ఆయా దేశాలపై ప్రతీకార సుంకాలు విధించేందుకు ఇదే సరైన సమయం. అధ్యక్షుడు చారిత్రాత్మక మార్పులు చేయబోతున్నారు' అని కరోలిన్ లీవిట్ వెల్లడించారు.

# ట్యాంకర్ నుంచి నైట్రోజన్ గ్యాస్ లీక్..

ఫ్యాక్టరీ గోదాములో పార్కు చేసిన ట్యాంకర్ నుంచి నైట్రోజన్ గ్యాస్ లీకైన ఘటనలో ఒకరు మరణించారు. మరో 40 మంది ఆస్పత్రిపాలయ్యారు. రాజస్థాన్‌లోని బీవార్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పరిసర ప్రాంతాల ప్రజలను అక్కడి నుంచి తరలించారు. మరింత అనర్థం జరగకుండా గ్యాస్ లీకేజీని కంట్రోల్ చేస్తున్నారు.వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్ రాష్ట్రం బీవార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బదియా ఏరియాలో సునీల్ ట్రేడింగ్ కంపెనీ ఉంది. ఈ కంపెనీ గోదాములో పార్క్ చేసిన ట్యాంకర్ నుంచి అర్ధరాత్రి నైట్రోజన్ గ్యాస్ లీకవడం మొదలైంది. స్థానికులు గమనించి పోలీసులకు, కంపెనీ ఓనర్‌కు సమాచారం ఇచ్చారు. దాంతో ముందుగా ఘటనా ప్రాంతానికి చేరుకున్న ఫ్యాక్టరీ ఓనర్ సునీల్ సింఘాల్ గ్యాస్‌ను కంట్రోల్ చేసేందుకు ప్రయత్నించారు. దాని ప్రభావంతో ఊపిరాడక మరణించారు.ఆ తర్వాత ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, సంబంధిత అధికారులు గ్యాస్ లీకేజీని అరికట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. పరిసర నివాసాల్లోని ప్రజలను



అక్కడి నుంచి తరలించారు. కానీ అప్పటికే 40 మంది శ్వాస ఆడని స్థితిలో ఆస్పత్రి పాలయ్యారు. అదేవిధంగా ఆ ప్రాంతంలోని పలు పెంపుడు జంతువులు, వీధి కుక్కలు, ఇతర ప్రాణులు మరణించాయి. ప్రస్తుతం పరిస్థితి దాదాపు అదుపులోకి వచ్చిందని, కంపెనీని సీజ్ చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# 140 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తున్న అనంత్ అంబానీ..



ఆసియాలోనే అత్యంత సంపన్నుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ చిన్నకుమారుడు అనంత్ అంబానీ పాద యాత్ర చేపట్టారు. తన 30వ పుట్టినరోజును పురస్కరించుకొని గుజరాత్‌లోని జామ్‌నగర్ నుంచి ద్వారక వరకూ ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభించారు.

%శుక్రవారం తెల్లవారుజామున అనంత్ తన పాదయాత్రను ప్రారంభించారు. మొత్తం 140 కిలోమీటర్ల ఈ ప్రయాణం ప్రస్తుతం 5వ రోజుకు చేరుకుంది. ఆయన ద్వారకాకు చేరుకోవడానికి మరో 2-4 రోజులు పట్టవచ్చని అంచనా. ట్రాఫిక్‌ను నివారించడానికి, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా %గ%ం భద్రత, స్థానిక పోలీసు రక్షణ మధ్య ఆయన తన యాత్రను రాత్రిపూట చేపడుతున్నారు. రోజూ 10 నుంచి 12 కిలోమీటర్ల మేర నడుస్తున్నారు.ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. 'ఈ పాదయాత్ర జామ్‌నగర్‌లోని ఇంటి నుండి ద్వారకకు ప్రారంభమైంది. ఇది గత 5 రోజులుగా కొనసాగుతోంది. మరో 2 లేదా 4 రోజుల్లో ద్వారకకు చేరుకుంటా. నేను ఏ పని ప్రారంభించాలన్నా ముందుగా ద్వారకాధీశుడిని స్మరించుకుంటా. అలా చేస్తే ఎలాంటి అవరోధాలూ లేకుండా తలపెట్టిన కార్యం విజయవంతంగా పూర్తవుతుందని నా నమ్మకం' అని అనంత్ అంబానీ తెలిపారు. ఏప్రిల్ 10న అనంత్ అంబానీ తన 30వ పుట్టినరోజును ద్వారక ఆలయంలో జరుపుకోనున్నట్లు తెలిసింది. ఆ రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

# అరుదైన ఫీట్‌ని సాధించిన సూర్యకుమార్ యాదవ్..!

ముంబయి ఇండియన్స్ బ్యాట్స్‌మెన్ సూర్యకుమార్ యాదవ్ అరుదైన ఘనత సాధించాడు. ముంబయిలోని వాఖండే స్టేడియంలో సోమవారం రాత్రి కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఘనత విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో గెలిచి.. ఈ సీజన్‌లో ముంబయి తొలి విజయాన్ని నమోదు చేసింది. కేకేఆర్‌కు ఇది రెండో ఓటమి కాగా.. పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరింది. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ ఆకట్టుకున్నారు. తొమ్మిది బంతుల్లో మూడు బౌండరీలు, రెండు సిక్సర్ల సహాయంతో 27 పరుగులు చేశాడు. దాంతో టీ20 క్రికెట్‌లో అరుదైన ఫీట్‌ని అందుకున్నాడు. టీ20 8వేల పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా ఘనత సాధించాడు. టీ20ల్లో సూర్యకుమార్ 8వేల కంటే ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్స్ సరసన నిలిచాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, సురేశ్ రైనా ముందున్నారు. 288వ టీ20 మ్యాచ్‌లో సూర్య కుమార్ ఈ ఘనతను సాధించాడు. ఇప్పటి వరకు అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ జాబితాలో విరాట్ ముందున్నాడు. విరాట్ 12,976 పరుగులు చేయగా.. రోహిత్ శర్మ (11,851), శిఖర్ ధావన్ (9,797), సురేశ్ రైనా 8,654 పరుగులతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.



# ఉజ్జయిని, ఓంకారేశ్వర్‌లో లిక్కర్ బ్యాన్

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని పుణ్య క్షేత్రాల్లో మద్యం నిషేధం అమలులోకి తెచ్చారు. మంగళవారం నుంచి పలు పట్టణాల్లో లిక్కర్‌పై బ్యాన్ విధించారు. జ్యోతిర్లింగ క్షేత్రాలైన ఉజ్జయిని, ఓంకారేశ్వర్‌తోపాటు మాహేశ్వర్, మైహర్ పట్టణాల్లో మద్య నిషేధాన్ని అమలు చేస్తున్నారు. వీటితో పాటు మొత్తం 19 మతపరమైన పట్టణాలు, ప్రాంతాల్లో, గ్రామ పంచాయతీల్లో బ్యాన్ ఉంటుంది. తమ ప్రభుత్వ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నదని సీఎం మోహన్ యాదవ్ తెలిపారు. జనవరి 24వ తేదీన సీఎం మోహన్ యాదవ్.. లిక్కర్ బ్యాన్ నిర్ణయాన్ని ప్రకటించారు. దానికి క్యాబినెట్ కూడా ఆమోదం తెలిపింది. మహేశ్వర్ పట్టణంలో ఆ మీటింగ్ జరిగింది. తాజా నిర్ణయం ప్రకారం లిక్కర్ షాపులు, బార్లను మూసివేయనున్నారు. ఉజ్జయిని, ఓంకారేశ్వర్, మాహేశ్వర్, మండలేశ్వర్, ఓర్చా, మైహర్, చిత్రకూట్, దాటియా, పన్నా, మండలా, ముల్తాయి, మందసౌర్, అమర్‌కాంతక్‌లోని పట్టణ ప్రాంతాల్లో వైన్ షాపులు, బార్లను మూసివేయనున్నారు. సల్కాన్‌పూర్, కుండల్‌పూర్, బండక్‌పూర్, బర్మన్‌కలన్, బర్మన్‌కుర్ద్, లింగా గ్రామ పంచాయతీ పరిధిలో కూడా మద్యం అమ్మకాలు ఉండవు.రాష్ట్రంలోని 19 అర్బన్, రూరల్ ప్రాంతాలు పూర్తిగా పవిత్రమైనవని ఇటీవల బీజేపీ సర్కారు ప్రకటించింది. ఆ తీర్మానం ప్రకారమే మద్యం అమ్మకాలపై నిషేధం విధించారు. డీ అడిక్షన్ దిశగా ఇది చరిత్రాత్మక అడుగు అని సీఎం యాదవ్ చెప్పారు. దైవ క్షేత్ర ప్రదేశాల్లో విశ్వాసాన్ని పెంచే ప్రయత్నం జరుగుతోందన్నారు.లిక్కర్ బ్యాన్ విధించిన ముఖ్యమైన ప్రదేశాల్లో ఉజ్జయిని ఉంది. ఈ పట్టణంలో మహాకాలేశ్వర్ ఆలయం ఉన్నది. ఇక నర్మదా నది పుట్టిన అమర్‌కాంతక్ పట్టణంలో కూడా నిషేధాన్ని విధించారు.

# ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య కాల్పులు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కథువాలో కూంబింగ్ ఆపరేషన్ జరుగుతున్నది. ఉగ్రవాదుల కోసం వేట కొనసాగిస్తున్నారు. ముగ్గురు మిలిటెంట్లు.. పంజతీర్థ-బరోటా ప్రాంతంలో దాక్కున్నట్లు తేలింది. దీంతో వారి కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య ఫైరింగ్ జరుగుతోంది. మార్చి 31వ తేదీన కథువాలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ తర్వాత ఇవాళ పలు భద్రతా దళాలు.. కథువా అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నది.%మార్చి 23వ తేదీన అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఉన్న నర్సరీలో ముగ్గురు ఉగ్రవాదులు ఎదురుపడ్డారు. అయితే ఆ ముగ్గురూ పరారీ అయ్యారు. నాలుగు రోజుల తర్వాత కథువాలో ఉన్న సన్యాల్ బెల్ట్ వద్ద మళ్లీ ఎదురుపడ్డారు. దీంతో అక్కడ ఎదురుకాల్పులు జరిగాయి. ఆ



సమయంలో నలుగురు పోలీసులతో పాటు మరో ముగ్గురు మృతిచెందారు. కథువా అడవుల్లో ఉన్న ఉగ్రవాదులు ఎప్పటికప్పుడు తమ లొకేషన్ మారుస్తూ పరారీ అవుతున్నారు.ఆర్మీ, పోలీసు, ఎన్ఎస్జీ, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ దళాలు ప్రస్తుతం కూంబింగ్ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. రుయి, జుథానా, ఘాటీ, సన్యాల్, బిల్లవార్ అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ జరుగుతున్నది.

# ఈపీఎఫ్‌వో గుడ్‌న్యూస్.. ఆటో సెటిల్‌మెంట్ రూ.5లక్షలకు పెంపు..!

న్యూఢిల్లీ, మార్చి 31: ప్రావిడెంట్ ఫండ్ సభ్యులకు కేంద్రం శుభవార్త తెలపనుంది. ఇప్పటివరకు ఆటో సెటిల్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ క్లెయిమ్ (ఏఎస్ఏసీ)పై ఉన్న లక్ష రూపాయ పరిమితిని రూ.5 లక్షలకు పెంచుతున్నట్టు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్ఓ) ప్రకటించే అవకాశం ఉందని ఏఎన్ఐ వార్తా సంస్థ తెలిపింది. ఇప్పుడున్న లక్ష రూపాయలను ఐదు రెట్లు పెంచి ఐదు లక్షలకు పెంచుతూ చేసిన ప్రతిపాదనకు కేంద్ర కార్మిక, ఉద్యోగ శాఖ కార్యదర్శి సుమితా దవ్రా ఆమోదం తెలిపారు.%గత వారం కశ్మీర్‌లో సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ రమేష్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో దీనిని ప్రతిపాదించారు. దీనిని తుది ఆమోదముద్ర కోసం సీబీటీకి పంపారు. ఇది అమలులోకి వస్తే ఏఎస్ఏసీ ద్వారా రూ.5 లక్షలు విత్‌డ్రా చేసుకునే ప్రయోజనం సుమారు 7.5 కోట్ల మంది పీఎఫ్ సభ్యులకు చేకూరుతుంది. అనారోగ్య, వైద్య చికిత్స కోసం సభ్యులు అడ్వాన్స్ కింద గరిష్ఠంగా రూ.50 వేల నగదు అత్యవసరంగా డ్రా చేసుకునే సౌకర్యాన్ని 2020 ఏప్రిల్‌లో ప్రవేశపెట్టారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com